ఇంకెన్నాళ్లు చెత్త కష్టాలు!

- వెంటాడుతున్న డంపింగ్ యార్డు సమస్య
- రోడ్లపైనే వ్యర్థాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

తుని: పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రధాన రోడ్లు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో పచ్చదనం ఉట్టిపడుతోంది. ఇంత వరకు బాగానే ఉంది. చెత్త సేకరణకు స్వచ్ఛ భారత్ కార్పొరేషన్‌తోపాటు పలు సంస్థలు ఇతోధికంగా సహకరిస్తున్నాయి. అసలు సమస్య డంపింగ్ యార్డు లేక పోవడం. దీంతో రోజువారీ ఉత్పత్తి అయ్యే వర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాల బారిన ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రోడ్డు పక్క వ్యర్థాలు వేయడంతో పందులు అందులో తిష్ట వేశాయి. ప్రజలు ఇంకా ఏన్నాళ్లు మాకు చెత్త కష్టాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. 14 వేల కటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రోజూ 15 వేల మంది వివిధ పనుల కోసం వస్తుంటారు. ఇళ్లు, హోటల్స్, కూరగాయలు, కిరాణా, పండ్లు, తినుబండారాలు తదితర కేటగిరిలో 39 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి సేకరించి 40 శాతం తడి, పొడి చెత్తగా విభజించి కంపోస్టు యార్డులు(సంపద సష్టి కేంద్రాలు)కు తరలిస్తున్నారు. ప్రధాన మార్కెట్‌లో వచ్చే బల్క్ వ్యర్థాలను పట్టణ శివారు ఇసుకలపేట శ్మశాన వాటిక సమీపంలోకి తరలిస్తున్నారు. వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక పోతున్నామని ప్రజలు అంటున్నారు. దీనికి తోడు పందులు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయి. ఇలాగే పరిస్థితి కొనసాగితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కొలిక్కిరాని డంపింగ్ యార్డు

పురపాలక సంఘం ఏర్పడి ఐదు దశాబ్దాలు అవుతున్నా డంపింగ్ యార్డు స్థలసేకరణ అందని ద్రాక్షగా మిగిలింది. పట్టణానికి సమీపంలో స్థల సేకరణ చేయాలంటే కోట్లు వెచ్చించాల్సి రావడంతో కార్యరూపం దాల్చలేదు. గతంలో తుని మండలం రేఖవానిపాలెం, ఎస్.చామవరం ప్రాంతాల్లో స్థలసేకరణ కోసం ప్రయత్నించినా అక్కడ ప్రజలు వ్యతిరేకించారు. ప్రస్తుతం డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలంటే 3 ఎకరాల స్థలం అవసరం. ఇంత పెద్దమొత్తంలో సొమ్ము వెచ్చించే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.



తుని ఉప్పరగూడెంలో రోడ్డులో డంపింగ్ చేసిన వ్యర్థాలు

పరిశుభ్రతకు ప్రాధాన్యం



పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం. డంపింగ్ యార్డు స్థలసేకరణకు చర్యలు తీసుకున్నాం. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తీసుకువచ్చిన సమస్యలపై అధికారులకు సూచనలు ఇస్తున్నాం. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయొద్దని ఆదేశాలు ఇచ్చాం. ప్రజలకు రోజువారీ వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయకుండా పారిశుద్య సిబ్బందికి అందజేసి సహకరించాలి.

– ఏలూరి సుధారాణి, చైర్‌పర్సన్, తుని

వ్యర్థాల డంపింగ్‌పై చర్యలు



పట్టణంలో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు డంపింగ్ చేయవద్దని అధికారులకు సూచనలు ఇచ్చాం. ఆర్థిక సంఘం నిధులతో తడి, పొడి చెత్త వేరు చేసేందుకు రెండు చోట్ల షెడ్లను నిర్మిస్తున్నాం. ఇవి అందుబాటులోకి వస్తే చెత్తకు పరిష్కారం లభిస్తుంది. స్థలసేకరణకు సంబంధించి తుని మండలం హంసవరం సమీపంలో డీ పట్టా భూమిని తీసుకునేందుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– వెంకట్రావు, కమిషనర్, తుని

క్లుప్తంగా

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి



శివరామపట్నం సభలో మాట్లాడుతున్న కర్నాకుల వీరాంజనేయులు

గోకవరం: అమర వీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి సభను శివరామపట్నం గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా వీరాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ భారత విప్లవ ఉద్యమ నేతల్లో చంద్ర పుల్లారెడ్డి, నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్, పొట్ల రామనరసయ్య, రంగవల్లక్క, చారు మజుందార్, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ సింగ్, కన్హాయ్ చటార్జి వంటి భారత విప్లవ నేతలు ఎందరో నవంబర్‌లో అమరులయ్యారన్నారు. ప్రజల కోసం అనునిత్యం పోరాడుతూ నేలరాలుతున్న వీరులను గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు రాజబాబు, బి.రమేష్, కుంచె అంజిబాబు, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్లను మంగళవారం పంపిణీ చేశారు. ఇటీవల రోటరీ ఆధ్వర్యంలో హైమా నేత్రాలయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి 80 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా అందజేసినట్టు రోటరీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు వీర్రాజు, కిషోర్‌రెడ్డి, ఈశ్వర్, గణేష్, హైమా నేత్రాలయం అధినేత పీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో మోదీ చిత్రపటం ఉంచాలి



ఏలేశ్వరం తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్ర పటాలను ఉంచాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లా శ్రీనివాస్‌తో పాటు పార్టీ నాయకులు తహసీల్దార్ వెంకటేశ్వరరావు కలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం పూర్తిచేసిన దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేశారు. కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పంట కోతపై అవగాహన



ముక్కొల్లులో పంటకోతపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కిర్లంపూడి: పంట కోతపై అగ్రికల్చర్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం ఏడీఏ ఎస్.దైవకుమార్ అన్నారు. ముక్కొల్లులో మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృత మంగళవారం పంటకోత ప్రయోగంపై వీఏఏ, వీహెచ్ఏలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ దైవకుమారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలతోనే ప్రధానమంత్రి పంట బీమా యోజన నిర్దేశిస్తున్నందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ వెంకటేశ్‌నాయుడు, ఏఈఓ ఆకుల సురేష్, ఇన్సూరెన్ ఏజెంట్ శివశంకర్ ఉన్నారు.

ఏలేశ్వరం మండల అధికారుల నంబర్లు

తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఏపీఓ	– 70939 98217
ఏపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఫలితాలు



కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. అల్లిపూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ వరి, ఉద్యాన పంటల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించడంతో ఆరోగ్యవంతమైన అధిక ఉత్పత్తులను సాధించవచ్చన్నారు. ప్రకృతి విధానంలో ఎరువులు, పురుగుమందుల తయారీ విధానం, వినియోగించే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పంట పొలాలను సందర్శించి కషాయాల తయారీని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కేవీ శివకుమారి, నల్లమిల్లి సురేష్, వీఏఏ సాయి పాల్గొన్నారు.

జంతువులను వేటాడితే కఠిన చర్యలు

జగ్గంపేట: జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ కె.వీరభద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరేంద్రపట్నంలో విద్యుత్ తీగలు తగిలి ఒక వ్యక్తి మృతి చెందారని, అటవీ సమీపంలో ఎవరైనా జంతువుల వేటకు ప్రయత్నం చేస్తే తమకి సమాచారం అందించాలని తెలిపారు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యం



ధర్మవరంలో మురళిరాజును కలిసిన సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమని ఆ పార్టీ నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు. ధర్మవరంలోని మురళీరాజు స్వగృహంలో మండలానికి చెందిన పలువురు గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. తాను పార్టీ శ్రేణులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటూ ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో చినశంకర్లపూడి గ్రామ సర్పంచ్ ఏపూరి రాంబాబు, చినశంకర్లపూడి, టి.రాయవరం, ఎంపీటీసీలు పిల్లా చిన్నా, తటవర్తి రామన్నదొర, నానిపల్లి చంటి, జువ్వల బాబులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించాలి



జగ్గంపేటలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ జగ్గంపేటలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించింది. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మరోతి శివ గణేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు స్థానిక ట్రావెలర్స్ బంగ్లా నుంచి విద్యుత్ డీఈ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. డీఈ కార్యాయలం వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం 6 నెలలు కాకుండానే ప్రజలను అన్ని రకాలుగా హింసిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మాదేటి సత్యానందరరావు, ఏపీ సీసీ జనరల్ సెక్రటరీ మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, పీసీసీ జనరల్ సెక్రటరీ నక్కా సత్యనారాయణ ,సీనియర్ కాంగ్రెస్ నేత వత్సవాయిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ఆందోళన

ప్రత్తిపాడు: విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ప్రత్తిపాడులో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపట్టింది. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ కళా మందిర్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. ఆరు నెలలు దాటినా సూపర్ సిక్స్ అమలు జరపకపోగా ప్రజలను హింసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటి నాయకులు కందిమళ్ల శామ్యూల్, మూరా నాగేంద్ర, ఈరుగుల చక్రం తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకొండ భూములు నిరుపేదలకు పంచాలి

గండేపల్లి: మండలంలోని కె.గోపాలపురం, జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామాల మధ్యలో ఉన్న 575 ఎకరాల అడ్డుకొండ భూములను నిరుపేదలకు పంచాలని ఏపీ రైతుకూలీ సంఘం డిమాండ్ చేసింది. కె.గోపాలపురం గ్రామస్తులతో మంగళవారం నిర్వహించిన సమావేశం వారు మాట్లాడుతూ పేదలకు భూమిని పంచి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజబాబు, రామలింగేశ్వరరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : యువకుడి మృతి



మృతి చెందిన నాని

జగ్గంపేట: గుర్రంపాలెం వద్ద మంగళవారం సాయింత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిప వివరాల ప్రకారం.. గొల్లలగుంటకు చెందిన యువకులు మోర్త సతీష్, మోర్త అబ్రహం, వేమగిరి యాకోబు బైక్‌పై జగ్గంపేట నుంచి తమ స్వగ్రామం వెళుతుండగా, భావవరం నుంచి జగ్గంపేట వైపు బైక్‌పై యువకులు గోళ్ల నాని(24), ఎస్.సతీష్ వస్తుండగా గుర్రంపాలెం వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలు కాగా వీరిని జగ్గంపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ గోళ్ల నాని మృతి చెందాడు. దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి



రౌతులపూడి తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తున్న రామ్‌కుమార్

ప్రత్తిపాడు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచ తప్పకుండా పాటించాలని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో రాజకీయ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికకు ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల చేస్తున్నందున సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని చెప్పారు. మండలంలో 53 మంది ఓటర్లున్నారని, మరో 78 ఓటరు నమోదుకు దరఖాస్తులు అందాయన్నారు. ఈసమావేశంలో సూపరిటెండెంట్ కె పుణ్యవతి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, ధరణాలకోట శ్రీను, కొండపల్లి శ్రీను, బొబ్బర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని ఇప్పటి వరకు 425 మంది పట్టభద్రులు మాత్రమే తమ దరఖాస్తులు అందజేశారన్నారు. నేడు (బుధవారం) సాయంత్రం ఐదు గంటలు వరకు దరఖాస్తులు నమోదు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

జగ్గంపేట: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్స్ తమ ఓట్లను నమోదు చేసుకోవాలని జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. జగ్గంపేట జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజి సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

జీతాలు చెల్లించాలని వినతి



రావికంపాడు పీహెచ్‌సీ డాక్టర్ లలిత కుమారికి వినతిపత్రం అందజేసిన 104 సిబ్బంది

ప్రత్తిపాడు రూరల్: తమకు జీతాలు తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ 104 సిబ్బంది మండలంలోని శంఖవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఆర్‌వీవీ సత్యనారాయణకు డిమాండ్లతో కూడిని వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గత మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించడంలేదని, దీంతో తమ కుటుంబాల పోషణ కష్టంగా మారిందని వాపోయారు. 2020 తరువాత విధుల్లో చేరిన 104 వాహన డ్రైవర్లు, డీఈఓకు జీవో ఏడు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో104 సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబు, డ్రైవర్లు మోహన్, డీఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: తమ వేతనాలు తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ 104 సిబ్బంది మండలంలోని పెద్దిపాలెం, రాచపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు కొండేపూడి యశస్వి, వై.గీతా సుధలకు డిమాండ్స్‌తో కూడిని వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డీఈఓలు బి ఇశ్రాయేలు రాజు, పాలకపాటి మణికంఠ, డ్రైవర్లు వీరభద్రరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని 104 వైద్య సేవల సిబ్బంది పీహెచ్‌సీ వైద్యాధికారులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. రావికంపాడు, ఎ.వి.నగరం వైద్యాధికారి ఆర్.లలిత కుమారి, పి.రవికుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 104 డీఇఓ సుధీర్, హరిప్రసాద్, ఈవో పీ.రమేష్,సుబ్రహ్మణ్యం తదితర సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



గోకవరంలో వీరభద్రునిగడ్డలో పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వి.కొత్తూరులో పుట్టకు పూజలు చేస్తున్న గ్రామీణులు



ఏలేశ్వరంలో పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: నిత్యం పంట పొలాల్లో సంచరించే గ్రామీణులు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు నిర్వహించారు. మంగళవారం పంట పొలాలకు వెళ్లి పుట్టలను శుభ్రపర్చి, ముగ్గులు వేసి చలివిడి, వడపప్పు, నువ్వుల చిమ్మిడి, పూజలు చేశారు. పుట్టలో చిమ్మిడితో పాటు కోడి గుడ్లు, పాలు వేసి నాగేంద్రుడికి పూజలు చేశారు. తుని నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు గ్రామాలకు రావడంతో కుమ్మరిలోవ, వి.కొత్తూరు, లోవకొత్తూరు, ఎస్.అన్నవరం తదితర గ్రామాల్లో సందడి నెలకొంది. పుట్ట పూజలు అనంతరం గ్రామీణులు కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడిపారు.

ఏలేశ్వరం: నాగుల చవితి వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. చవితి సందర్భంగా పొలాల్లో సందడి నెలకొంది. ఉదయాన్నే తలస్నానం చేసి పొలాల్లోని నాగేంద్రునికి నువ్వులతో చేసిన చిమ్మిడి, పాలు, గ్రుడ్లు. పుట్టల్లో పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఏలేశ్వరం, లింగంపర్తి, సిరిపురం, చిన్నింపేట,యర్రవరం తదితర గ్రామాల్లో నాగులచవితి వేడుకలు నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద పుట్టలను పసుపు కుంకుమలు, పువ్వులతో అలంకరించి మహిళలు పూజలు చేశారు.

రౌతులపూడి: మండలంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్టల వద్ద పూజలు చేశారుమిడి, వడపప్పలను స్వామివారికి పుట్టలో వేసి నైవేద్యాలు సమర్పించారు.

గండేపల్లి: మండల ప్రజలు నాగుల చవితిని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పంట పొలాలు భక్తులతో కళకళలాడాయి.

జగ్గంపేట: మండలంలో నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక రోడ్డులోని సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయం వద్ద ఉన్న పుట్టల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు : మండలంలోని పల్లెల్లోనూ మంగళవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి.

గోకవరం: నాగుల చవితిని మండల ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పుట్టల్లో పాలు వేసేందుకు ఉదయం నుంచి అటవీ ప్రాంతాలు, తోటల వైపు ఎగబడ్డారు. పుట్టలు శుభ్రం చేసి పసుపు, కుంకుమ, పూలతో సుందరంగా అలంకరించారు. నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు, గుడ్లు వంటి నైవేద్యాలు సమర్పించారు. చిన్నా, పెద్దా అంతా కలిసి పుట్టల వద్ద బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని జగ్గంపేట, రంపచోడవరం, రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారుల కిటకిటలాడాయి. మండలంలోని సింగారమ్మచింత వద్దకు భారీ సంఖ్యలో ప్రజలు పోటెత్తడంతో సందడి వాతావరణం నెలకొంది. మండల కేంద్రమైన గోకవరంలో వీరభద్రునిగడ్డె ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలోని పుట్టలో పాలు పోసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వీరలంకపల్లి గ్రామంలోని త్రిమూర్తులు ఆలయం ప్రాంగణంలో ఉన్న పుట్టలో పాలు పోసేందుకు ప్రజలు బారులుతీరారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో శ్రీరామగిరి కొండపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం, కొత్తపల్లి రాజుగారితోటలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజాల



బాధ్యతలు స్వీకరించిన రాజాల చిట్టిబాబును సత్కరిస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది రాజాల చిట్టిబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గత మే నాలుగో తేదీన జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీ పడిన అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, రాజాల చిట్టిబాబులకు చెరి సమానంగా ఓట్లు లభించాయి. దీంతో ఎన్నిక వ్యవహారం జటిలం కావడంతో హైకోర్టు బార్ కౌన్సిల్ దృష్టికి వెళ్ళింది. దీందో చెరో ఆరు నెలల పాటు బార్ అధ్యక్షునిగా కొనసాగాలంటూ హైకోర్టు బార్ కౌన్సిల్ సూచించడంతో తొలుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికైన అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు పదవీ కాలం ముగియడంతో స్థానిక కోర్టు ప్రాంగణంలోని బార్ కార్యాలయంలో రాజాల చిట్టిబాబు అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాజాల చిట్టిబాబును ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, బార్ కార్యదర్శి బొంగుశూరి మధుబాబు, బార్ ప్రతినిధులు నరహరిశెట్టి రావికృష్ణ, ఆడారి సుగుణ, పోతుల జోగేష్, మల్లేశ్వరరావు, సీహెచ్ రామకృష్ణ, పలివెల నాగేంద్ర, అత్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బార్ నూతన అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు మాట్లాడుతూ అనాదిగా ప్రత్తిపాడు కోర్టు సింగల్ కోర్ట్‌గా నడుస్తుందని, అదనపు కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఎన్నిక వరకే రాజకీయాలను పరిమితం చేయాలని, బార్ అభివృద్ధికి పాటు పడతానని రాజాల చిట్టిబాబు హామీ ఇచ్చారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

తుని: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసామని స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. తుని పట్టణం వాణి అపార్ట్‌మెంటులో నివాసం ఉంటున్న బగిరత్గర్ వ్యాపార నిమిత్తం రాజమండ్రి వెళ్లే క్రమంలో స్థానిక ఒకటో నంబర్ ఫ్లాట్ ఫారంపై జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కబోయాడు. ప్రమాదవశాత్తు జారి రైలు కింద పడిపోయాడు. ఎడమ కాలుకి బలమైన గాయం కావడంతో అంబులెన్స్‌లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.